క్లుప్తంగా

విద్యుత్ ఉద్యోగుల ఆందోళన



వాల్‌పోస్టర్ విడుదల చేసిన విద్యుత్ ఉద్యోగులు

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు ఈ నెల 6న విశాఖపట్నంలోని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కార్పొరేట్ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నారు. 8న తిరుపతి కార్పొరేట్ కార్యాలయం, 13న చలో విజయవాడ, 15 నుంచి నిరవధిక సమ్మె చేయనున్నారు. ఈ మేరకు వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా డిస్కమ్ జేఏసీ నేతలు భూక్యా నాగేశ్వరరావు, తురగా రామకృష్ణ మాట్లాడుతూ కంపెనీ పరిధిలోని అన్ని జిల్లాల ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎం రమేష్, ఎస్ నరసింహారావు, పి.శ్రీనివాస్, కె.కృష్ణ కుమార్, జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

4న జిల్లా ఇన్‌చార్జి మంత్రి మనోహర్ పర్యటన

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో ఈనెల 4న ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు ఏలూరు కొటదిబ్బలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రాంగణంలో ఆటో డ్రైవర్ సేవ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మనోహర్ పాల్గొంటారు.

ముందస్తు నోటీసులు ఇవ్వాలి



మాట్లాడుతున్న అసిస్టెంట్ డైరెక్టర్ రమణారావు

దెందులూరు: రీ సర్వే కోసం రైతులకు నాలుగు రోజులు ముందు నోటీసులు ఇవ్వాలని ల్యాండ్ సర్వే ఏలూరు డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ రమణారావు అన్నారు. బుధవారం ఏలూరు రూరల్ మండలం మానూరు గ్రామంలో తహసీల్దార్ జి.విజయకుమార్ రాజు ఆధ్వర్యంలో డీటీ నాగమణి అధ్యక్షతన రీ సర్వే అవగాహన సమావేశం నిర్వహించారు. నాగమణి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దెందులూరు: కొక్కిరాయిలంక పరిసర ప్రాంత గ్రామాలకు శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ మండలం అసిస్టెంట్ ఇంజినీర్ నరసయ్య తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ధరల చూపు.. ఆకాశం వైపు

- నిత్యం పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు
- సామాన్యులకు ధరాఘాతం
- నియంత్రించని ప్రభుత్వాలు





ఏలూరు (టూటౌన్): నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకు ఆకాశంపై చూస్తున్నాయి. పెరిగిన ధరలతో సామాన్య ప్రజలు అల్లాడుతున్నారు. నిత్యావసరాలు, కూరగాయల ధరలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదుపు చేయడంలో విఫలమవుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏలూరు నియోజకవర్గంలో 3.70 లక్షల మంది వరకు జనాభా నివశిస్తున్నారు. సుమారు లక్షకు పైగా కుటుంబాలు ఉన్నాయి. వీరిలో 90 శాతం కుటుంబాలు పేద, మధ్య తరగతి వారే. వీరి సగటు ఆదాయం నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేలులోపే ఉంది. గతంలో నిత్యావసరాలు, కూరగాయలు, పాలకు కలిపి నెలకు రూ.10 వేలు వరకు ఖర్చు అయ్యేది. ప్రస్తుతం వాటి ధరలు పెరగడంతో తక్కువలో తక్కువ రూ.15 వేలు కూడా సరిపోని పరిస్థితి నెలకొంది. దీంతో సామాన్య, పేదల ప్రజలు పౌష్టికాహారానికి దూరం కావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

ధరలకు రెక్కలు

ఎన్నడూ లేని విధంగా వర్షాకాలంలో కూడా కూరగాయల ధరలకూ రెక్కలు వచ్చాయి. ఏ కూరగాయ కొనాలన్నా కిలో రూ. 40 నుంచి రూ.60 వరకు చెల్లించాలి. చిక్కుడు లాంటివైతే కిలో రూ.150 అమ్ముతున్నారు. కిలో కంది పప్పు క్వాలిటీని బట్టి రూ.150 నుంచి రూ.170లు, మినుములు రూ.120 నుంచి రూ.165లు, పొట్టు టీసిన మినపగుళ్ల క్వాలిటీవైతే రూ.200 వరకు, పెసర పప్పు రూ.110 నుంచి రూ.130లు, శనగపప్పు రూ.90 పైనే, వేరుశనగ రూ.120 నుంచి రూ.160లు వరకు విక్రయిస్తున్నారు. కిలో చికెన్ రూ.240 నుంచి రూ.260, మటన్ రూ.750 నుంచి రూ.1000, చేప రూ.160 నుంచి రూ.200, రొయ్యలు సైజులను బట్టి రూ.220 నుంచి రూ.450, నల్ల జాతి చేపలు కిలో రూ.400 నుంచి రూ.450లకు పెరిగాయి.

ధరలను నియంత్రించాలి



పెరిగితోన్న నిత్యావసర సరుకుల ధరల నియంత్రణకు పాలకులు చర్యలు తీసుచోవాలి. కూరగాయల రైతుల పరిస్థితి అతి వృష్టి లేదా అనావృష్టిగా మారింది. ప్రజల కొనుగోలు శక్తిని పెంచే విధంగా నిత్యావసరాలు, కూరగాయల ధరలను అందుబాటులోకి తేవాలి.

– బండి వెంకటేశ్వరరావు, సీపీఐ నేత, ఏలూరు

బడ్జెట్ రెట్టింపు



అన్ని నిత్యావసర సరుకుల ధరలు కూడా బాగా పెరిగిపోయాయి. గత వారం రూ.100 నుంచి రూ.150 ఉన్న కూరగాయాల ఖర్చు తాజాగా రెట్టింపైంది. రోజు వారీ వినియోగించే మినపగుళ్ల కిలో రూ.160 నుంచి రూ.200 పెరిగింది. నిత్యం కూరల వద్ద సర్దుకుపోవాల్సి వస్తుంది.

– వెంపా విజయలక్ష్మి, గృహిణి, పాలగూడెం, ఏలూరు రూరల్ మండలం

ఏమీ కొనేటట్టు లేదు



ఎన్నడూ లేని విధంగా అన్ని వస్తువుల ధరలు పెరిగాయి. ఏమీ కొనలేని, తినలేని పరిస్థితి నెలకొంది. కూరగాయలు ధరలు మండి పోతున్నాయి. పప్పుదినుసుల పరిస్థితి ఇలానే ఉంది. ప్రజల కొనుగోలు శక్తి పెంచే విధంగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి.

– సిహెచ్ నిర్మల, ఏలూరు వన్‌టౌన్

పాలకులు స్పందించాలి



ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతున్న నిత్యావసర సరుకులు ధరల నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గింది. పూర్తిస్థాయిలో పౌష్టికాహారం తీనే పరిస్థితి లేదు. ప్రజల ఆదాయం పెంచే విధంగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి.

– పి.కిషోర్, ఏఐటీయూసీ నేత, ఏలూరు

ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం



వెంకట రమాదేవిని అభినందిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

ఏలూరు (టూటౌన్): స్థానిక ఆర్‌ఆర్‌పేట శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం నూతన పాలక మండలి శుక్రవారం ప్రమాణ స్వీకారం చేసింది. ధర్మకర్తల మండలి చైర్మన్‌గా పాలడుగు వెంకట రమాదేవి, సభ్యులుగా ఈత కోట శ్రీనివాసరావు, నంగులూరి సత్యనారాయణ, సువ్వాడ పద్మావతి, చొటుపల్లి తులసి, బొత్స మధు, గోకా నెహ్రూబాబు, డొక్కు రమాదేవి, గుమ్మడి లక్ష్మీ గణేశ్వరి, రంభా అనసూయ, కందుకూరి వెంకట సీతారామాంజనేయ శర్మ, ఎక్స్ అఫిషియో సభ్యునిగా కిళాంబి మారుతి శ్రీనివాసరావు నియమితులయ్యారు. వీరితో ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ప్రమాణ స్వీకారం చేయించారు. మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, డిప్యూటీ మేయర్లు పప్పు ఉమామహేశ్వరరావు, వందనాల దుర్గా భవాని, ఇడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి ఆలయ ఈఓ నల్లూరి సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే పురోభివృద్ధి



మాట్లాడుతున్న గ్రామ సర్పంచ్ తోకల అమల

దెందులూరు: అవగాహనతోనే పురోభివృద్ధి, జీవన విధానం మెరుగుపడుతుందని కొక్కిరాయిలంక గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత తోకల అమల అన్నారు. ఏలూరు రూరల్ మండలం కొక్కిరాయిలంక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన గ్రామసభకు సర్పంచ్ అధ్యక్షత వహించి మాట్లాడారు. జీఎస్టీలో రాయితీ ఇచ్చిన వస్తువులపై అవగాహన కల్పించారు. తొలుత జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. గ్రామ కార్యదర్శి రాంజీ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత తోకల మోహన్‌రావు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

రోగులు ఇబ్బంది పడకుండా సేవలు



పూళ్లలో వైద్య సేవలపై ఆరా తీస్తున్న జిల్లా వైద్యాధికారి డా. పీజే అమృతం

భీమడోలు: వైద్యుల సమ్మె కారణంగా ఆసుపత్రుల్లో రోగులు ఇబ్బందులు పడకుండా వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా వైద్యాధికారి పీజే అమృతం అన్నారు. పూళ్ల పీహెచ్‌సీని శుక్రవారం ఆమె ఆకస్మిక సందర్శన చేశారు. వైద్యుల సమ్మె నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫసర్ డాక్టర్ జి.శ్రీలక్ష్మిని నియమించి రోగులకు వైద్య సేవలందిస్తున్నారు. ఆసుపత్రిలో రోగులకు సక్రమంగా సేవలు అందుతున్నదీ లేనిదీ ఆమె రోగుల నుంచి ఆరా తీశారు. ఆసుపత్రిలోని మందులు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి ఆసుపత్రిలోని సిబ్బందికి పలు సూచనలందించారు. ఫ్రిజ్‌లో భద్రపర్చే కుక్క, పాము కాటు వ్యాక్సిన్‌లను ఆమె పరిశీలించారు. వైద్యుల సమ్మె వల్ల విధులు బహిష్కరించినప్పటికీ ఎట్టి పరిస్థితుల్లోను ఓపీ సేవలు పూర్తి అందించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. అనంతరం పీహెచ్‌సీ పనితీరును ఆరోగ్య విస్తరణాధికారి వైవీ లక్ష్మణరావు నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఉజ్జీవ ఉపవాస ప్రార్థనలు



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు

దెందులూరు: ప్రతి మనిషి వ్యక్తిగతంగా కుటుంబపరంగా సామాజికంగా మార్పు చెందాలని దెందులూరు ఎరుషలేము ప్రేయర్ మినిస్ట్రీస్ పాస్టర్ గ్రేస్ ర్యాలీ అన్నారు. దెందులూరు యాదవుల వీధిలో రైస్ మిల్ ఎదుట మూడు రోజుల ఉజ్జీవ ఉపవాస ప్రార్థనలో భాగంగా పాస్టర్ గ్రేస్ మాట్లాడుతూ దెందులూరు ఏలూరు, పెదవేగి మండలాల నుంచి వచ్చిన విశ్వాసులు మార్పునకు నిదర్శనమన్నారు. దేవుని ఆజ్ఞలు అనుగుణంగా జీవనవిధానం మార్చుకోవాలని ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతి ఒక్కటి సాధ్యపడుతుందన్నారు. మూడు రోజులు పాటు వాక్య సందేశాన్ని అందించడానికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పాస్టర్లను జెరూసలేం ప్రేయర్ మినిస్ట్రీస్ తరపున పాస్టర్ గ్రేస్‌రాని సంఘస్తులను ఘనంగా సత్కరించారు.

పంచాయతీ భవన నిర్మాణానికి చర్యలు తీసుకోండి

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం మండలం కనకాద్రిపురంలో పంచాయతీ భవనం నిర్మించాలని గ్రామస్తులు దాఖలు చేసిన రిట్ పిటిషన్ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అంగీకరించింది. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్ కమీషనర్, జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారిని హైకోర్టు ఆదేశించినట్లు తెలిపారు. 2020లో కోర్టు కేసు కారణంగా కుంతలగూడెం పంచాయతీ కార్యాలయం కనకాద్రిపురంలో ఏర్పాటు చేసినట్లు ఆ గ్రామ ప్రజలు కోర్టు దృష్టికి తెచ్చారు. కనకాద్రిపురం గ్రామంలో పంచాయతీ భవనం నిర్మాణం కోసం పంచాయతీ తీర్మానం చేసిందని, సర్వే నెంబర్ 10 లో 15 సెంట్ల స్థలం కేటాయిస్తూ గ్రామ కార్యదర్శి ప్రొసీడింగ్స్ ఇచ్చారని కోర్టుకు దస్త్రాలు సమర్పించారు. దీనిపై ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ కోర్టు ఆదేశాలను పరిశీలించాల్సి ఉందన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	24	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	44	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	48	బిళ్లచిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	00	చామదుంపలు	38
బెండకాయలు	24	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	48	కంద	00
కాకర కాయలు	36	బీట్‌రూట్	40
బీరకాయలు	36	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	40	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	26	అల్లం	70-96
క్యారెట్	46	కొత్తిమీర (కట్ట)	30
దొండకాయలు	38	పాలకూర	10
బంగాళదుంపలు	24	తోటకూర	10
ఉల్లిపాయలు	24	చుక్కకూర	10
గోరుచిక్కుడు	46	గోంగూర	07-10
దోసకాయలు	30	పుదీనా	05
ఆనబకాయ (1)	30	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకదదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	01
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	02
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	01
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	00
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	01
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	00
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	00
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	01
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	00
ఏలూరు - తిరుపతి	16.00	4830	28

ముగిసిన దసరా ఉత్సవాలు



కాశీ అన్నపూర్ణదేవికి సారె సమర్పించిన భక్తులు



రాజరాజేశ్వరీ దేవిగా శ్రీసౌభాగ్యలక్ష్మి దేవి



అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ



దేవతామూర్తుల వేషధారణలో చిన్నారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలో దసరా మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో 9 రోజులు పాటు నిర్వహించారు. ఉత్సవాలు ముంగింపు సందర్భంగా ఆలయాల్లో అమ్మవార్లకు విశేష అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు, విశేష హోమాలు నిర్వహించారు. అమ్మవార్లకు మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేసి, అష్టోత్తర శతనామ పూజలు చేశారు. కాశీఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి భక్తులు సారెను సమర్పించారు. అంబికాదేవి ఆలయంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సౌభాగ్యలక్ష్మి, దత్తాశ్రమంలో అమ్మవార్లను రాజరాజేశ్వరిదేవిగా అలంకరించారు.

- శ్రీ సత్య సాయిబాబా వందవ జన్మదినోత్సవం, విజయ దశమి సందర్భంగా నగర సంకీర్తన చేసినట్టు శ్రీ సత్య సాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కానుమిల్లి శశి శేఖరరావు తెలిపారు. స్థానిక రామకృష్ణాపురం శ్రీ సత్యసాయి మందిరంలో విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజ, సాయంత్ర లలితా సహస్రనామార్చన, బాల్యవికాస్ చిన్నారులతో దేవతామూర్తుల అలంకరణ చేసి నృత్యప్రదర్శన చేశామని తెలిపారు. డాన్స్ మాస్టర్ కె.రాజేష్‌ను సన్మానించారు. బాలవికాస్ గురువులు, మహిళలు పాల్గొన్నారు.

సుఖసంతోషాలతో జీవించాలి



వాహన పూజ చేస్తున్న ఎస్పీ శివకిషోర్

ఏలూరు టౌన్: జిల్లా ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని, పాడిపంటలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ విజయదశమి ప్రత్యేక పూజలు ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్, ఆయన సతీమణి ధాత్రి రెడ్డి నిర్వహించారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గురువారం ఉదయం వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏఆర్ కార్యాలయంలో ఆయుధ పూజ, వాహన పూజలు నిర్వహించారు. ఎస్పీ ఆయుధాలకు, శాంతిభద్రతల పరిరక్షణకు వినియోగించే పోలీస్ వాహనాలకు పూజ చేశారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ జయంతి, దివంగత లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, ఎస్‌బీ సీఐ మల్లేశ్వరరావు, వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ, మహిళా స్టేషన్ సీఐ ఎం సుబ్బారావు, ఆర్ఐ పవన్‌కుమార్, ఆర్ఎస్ఐలు భాస్కరరావు, సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

తప్పిపోయిన బాలిక తండ్రి చెంతకు



బాలికను తండ్రికి అప్పగిస్తున్న కానిస్టేబుల్, హోంగార్డు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో శుక్రవారం ఉదయం తప్పిపోయిన ఒక బాలిక పోలీసుల చొరవతో తన తండ్రి చెంతకు చేరింది. వివరాల్లోకి వెళితే. తూర్పుగోదావరి జిల్లా రంగాపురానికి చెందిన భవానీ దీక్షాదారుడు చిన్నా కుటుంబ సమేతంగా విజయవాడ నుంచి ద్వారకాతిరుమల క్షేత్రానికి ఉదయం విచ్చేశారు. స్వామివారి దర్శనానికి వెళ్లే క్రమంలో తూర్పురాజగోపురం వద్ద తన కుమార్తె మహాలక్ష్మి తప్పిపోయింది. ఆ బాలిక ప్రధానరాజగోపురం మెట్ల మార్గం గుండా నడుచుకుంటూ కొండ కింద స్వామివారి కళ్యాణ మండపం వద్దకు చేరింది. అక్కడ ఏడుస్తున్న బాలికను చూసిన కానిస్టేబుల్ చిరంజీవి, హోంగార్డు బాజీలు ఆరా తీశారు. బాలిక వద్ద ఉన్న చిన్న సెల్‌ఫోన్‌లోని నెంబర్లు ఆధారంగా తన తండ్రికి సమాచారం అందించారు. తండ్రి మండపం వద్దకు చేరుకోగా, కానిస్టేబుల్, హోంగార్డులు బాలికను ఆయనకు అప్పగించారు.

ప్రొటోకాల్ ఉల్లంఘన

ద్వారకాతిరుమల: మండలంలోని కొమ్మర గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టు గ్రామ సభ శుక్రవారం నిర్వహించారు. అధికారులు ప్రొటోకాల్ ఉల్లంఘించారని, తనకు కనీసం సమాచారం ఇవ్వకుండా ఈ సభను నిర్వహించారని స్థానిక ఎంపీటీసీ మానుకొండ కన్నయ్య విలేకర్లకు తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమానికి ఒక ప్రజాప్రతినిధిని ఆహ్వానించకుండా గ్రామ సభ నిర్వహించిన అధికారుల తీరును ఆయన తప్పుపట్టారు. తనను అవమానించారని కన్నయ్య ఆవేదన వ్యక్తం చేశారు. తాను వైఎస్సార్‌సీపీకి చెందిన వాడిని కావడంతో అధికారులు ఇలా చేశారని ధ్వజమెత్తారు.

భవానీలకు భిక్ష



భవానీలకు అన్నదానం చేస్తున్న దృశ్యం

దెందులూరు: గోపన్నపాలెంలో ప్రతిరోజు భవాని మాలదారులకు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీనియర్ భవాని మాలదారుడు కొండేటి బాబు అన్నదానం చేస్తున్నారు. వ్యక్తిగతంగా ఆధ్యాత్మికంగా ప్రతి సంవత్సరం భవాని, అయ్యప్ప మాలధారులకు ప్రతిరోజు అన్నదానం చేయడం తృప్తినిస్తుందని తెలిపారు.

రైతు బజార్‌ను ఏర్పాటు చేయాలి

భీమడోలు: భీమడోలు గ్రామ పంచాయతీ వద్ద గురువారం జరిగిన గ్రామ సభలో గ్రామంలో రైతు బజారును ఏర్పాటు చేయాలని కోరుతూ కూటమి నాయకులు గ్రామ సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీల వద్ద సభలు నిర్వహించారు. భీమడోలులో సర్పంచ్ పాము సునీత మాన్‌సింగ్ అధ్యక్షతన జరిగి సభలో బహిరంగ మార్కెట్‌లో రోజురోజుకు పెరిగిపోతున్న కూరగాయాలు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించేందుకు, గ్రామంలో రైతు బజారును ఏర్పాటు చేయాలని పలువురు వినతిపత్రాలు అందజేశారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకుని వెళ్లి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. పంచాయతీ కార్యదర్శి కేవీఎల్ తనూజ, ఏఎంసీ చైర్మన్ శేషగిరి, పెద్దలు యుగంధర్, కుక్కల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.